వైబీ హళ్లిలో టీడీపీకి షాక్

● వైఎస్సార్‌సీపీలో చేరిన 20 కుటుంబాలు

మడకశిర: మండలంలోని వైబీ హళ్లి గ్రామ పంచాయతీలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. ఈ పంచాయతీ పరిధిలోని వైబీ హళ్లి, కోడిపల్లి గ్రామాలకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు శనివారం మడకశిరలో ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో రామన్న, రామాంజప్ప, రంగనాథ్, గోవిందప్పతో పాటు 20 కుటుంబాలు ఉన్నాయి. అనంతరం వారు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపునకు కష్టపడి పని చేస్తామని తెలిపారు. టీడీపీలో నిజమైన కార్యకర్తలకు గుర్తింపు లభించడం లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల సంక్షేమానికి కష్టపడి పని చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మంజునాథ్, నాగభూషణ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, దొడ్డయ్య, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

క్లుప్తంగా

‘మేరీ మట్టి-మేరా దేశ్’ ర్యాలీ



మట్టిని అందజేస్తున్న వైద్యులు, అధ్యాపకులు

పెనుకొండ: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. సేకరించిన పవిత్ర మట్టిని సత్యసాయి సంస్థ ప్రతినిధి శంకరప్పకు అందజేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాజశేఖర్, మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, రంగనాయకులు, రామన్న, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



మహేష్

పెనుకొండ రూరల్: ఇటీవల ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో మావటూరు పాఠశాల విద్యార్థి కె.మహేష్ సత్తా చాటినట్లు ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహేష్‌ను రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జీబీ విశ్వనాథ్ శనివారం తెలిపారు. గుండె జబ్బులు, బీపీ, జీర్ణశయం, పేగులు, కాలేయ సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రబుల్, గ్యాస్టిక్, అల్సర్, మొలలు, హెర్నియా, వరబీజము తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కావేరి ఆస్పత్రి బెంగళూరు వారు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా చికిత్సలు, ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు వైద్య శిబిరం ప్రారంభం అవుతుందన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

మడకశిరరూరల్: మండలంలోని హరేసముద్రం, గొల్లపల్లి గ్రామాల్లో ‘గడప గడపకూ మన ప్రభుత్వం’ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి తెలిపారు. శనివారం హరేసముద్రం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ, సీసీ రోడ్ల సౌకర్యం కల్పించాలని ఇటీవల నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామికి ప్రజలు విన్నవించారన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా డ్రైనేజీ, సీసీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. అందులో భాగంగానే డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తున్న నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కన్నడ రాజ్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

పావగడ: నవంబర్ 1వ తేదీన 50వ కన్నడ రాజ్యోత్సవ సువర్ణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక తాలూకా కార్యాలయంలో శనివారం కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో భాగంగా ముందస్తు సభ నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సువర్ణ కన్నడ రాజ్యోత్సవ వేడుకల్లో తాలూకా వ్యాప్తంగా 9 వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన 18 మంది ప్రముఖులను సన్మానిస్తామన్నారు. అలాగే వారికి పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఈఓ జానకి రాం, సీఐ సురేశ్, ముఖ్యాధికారి షంషు, ప్రసన్న మూర్తి, ఆర్బి ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కసాప అధ్యక్షుడు కట్టా నరసింహ మూర్తి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర: పట్టణంలో ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ మహేంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మడకశిర టౌన్‌లో 11 కేవీఏ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ అంతరాయం ఉంటుదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పరిగి: మండలంలోని పైడేటి వద్ద ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లి గ్రామ సమీపంలో శనివారం పేకాట ఆడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరి కొంతమంది పరారీలో ఉండగా వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నవరాత్రులకు ఆలయాల ముస్తాబు



రొళ్ల మండలం జీరిగేపల్లిలో త్రిశక్తి దేవతలుగా విరాజిల్లుతున్న అమ్మాజీ దేవతలు



రొళ్ల మండలం రత్నగిరిలో అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీ దేవి

రొళ్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం నుంచి తొమ్మిది రోజుల పాటు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రొళ్ల మండలం జీరిగేపల్లిలో త్రిశక్తి దేవతలుగా విరజిల్లుతున్న మారెక్క, ముడుపక్క, గ్యారక్క దేవతలు, రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీ దేవి, బంద్రేపల్లి, పిల్లిగుండ్ల లక్ష్మీదేవి, గుడ్డగుర్కి కొల్హాపురి మహలక్ష్మీ దేవి తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు. శనివారం ఆలయాలను నీటితో శుభ్రం చేశారు. మామిడి తోరణాలు, పూలు, అరటి పిలకలతో అలంకరణ చేసి ఆలయాలను ముస్తాబు చేశారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

అమరాపురం: శరన్నవరాత్రి ఉత్సవాలకు మండలంలో దేవాలయాలను కమిటీ సభ్యులు ముస్తాబు చేశారు. పట్టణంలోని ప్రసన్న లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, కన్యకా పరమేశ్వరీ దేవి, చోళమాంబ దేవాలయాలను చూడుముచ్చటగా అలంకరించారు.

475 మందికి కంటి పరీక్షలు

హిందూపురం: అవయవాల్లో ప్రధానమైన కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలని డాక్టర్ మాధవి అన్నారు. శనివారం స్థానిక సీఅండ్ఐజీ మిషన్ చర్చి కాంపౌండ్‌లో ట్రీనిటి సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్‌కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 475 మంది పరీక్షలకు హాజరయ్యారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ మాధవి 155 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపికైన రోగులందరినీ బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. గత నెలలో ఆపరేషన్ పూర్తి చేయించుకున్న వారికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఅండ్ఐ కాంపౌండ్ చర్చి కమిటీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్, కార్యదర్శి పాల్, డికెన్ బోర్డు సభ్యులు, వలంటీర్ రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మాధవి

బ్లాస్టింగ్‌తో బెంబేలు



ఆల్విన్ ఫ్యాక్టరీ ప్రాంతంలో బ్లాస్టింగ్ జరుగుతున్న దృశ్యం

పెనుకొండ: పట్టణ నడిబొడ్డున ఆల్విన్ ఫ్యాక్టరీ (హెచ్ఎంటీ) వద్ద పెద్ద ఎత్తున బ్లాస్టింగ్ చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. హెచ్ఎంటీ ఫ్యాక్టరీని మూసి వేసి ఆ స్థలాన్ని వేలం వేయగా కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. పై స్థలంలో బండరాయి ఉండటంతో దానిని పేల్చేందుకు నిర్వాహకులు రోజూ బ్లాస్టింగ్ చేపడుతున్నారు. ఫ్యాక్టరీకి సమీపంలోనే పోలీస్ క్వార్టర్స్, డీఎస్పీ కార్యాలయం, ఎంపీడీఓ, ఇంజినీరింగ్, సెబ్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం బండరాళ్లకు మందు గుండు సామగ్రి అమర్చి పేల్చుతుండటంతో పెద్ద శబ్దాలు వస్తున్నాయి. పోలీసులు అనుమతి ఇవ్వడంతోనే ఈ బ్లాస్టింగ్ చేస్తున్నామని కూలీలు చెబుతున్నారు. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయపడుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



కరావులీశ్వర దేవాలయానికి విరాళం అందజేస్తున్న నాగభూషణ రెడ్డి దంపతులు

గోరంట్ల: కరావులపల్లిలో దాతలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కరావులీశ్వర దేవాలయ నిర్మాణానికి వైస్ ఎంపీపీ వడిగేపల్లి నాగభూషణ రెడ్డి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. శనివారం ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు రేవతి రామచంద్రారెడ్డి, చింతాకృష్ణారెడ్డి, గంపల వెంకట రమణారెడ్డి, గొల్లశ్రీరాములు, రేవతి కృష్ణారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులు నాగభూషణరెడ్డి దంపతులను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు జావుకులదిన్న సుబ్బారెడ్డి, సామలపల్లి రాము, పెడపల్లి శ్రీనివాసనాయక్, నాగభూషణ రెడ్డి, శంకర్, మైలారప్ప, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరా వేళ.. తస్మాత్ జాగ్రత్త

హిందూపురం అర్బన్/పెనుకొండ రూరల్: దసరా సెలవుల నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని హిందూపురం పట్టణ సీఐ శ్రీనివాసులు, కియా ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. ఊళ్లకు వెళ్లే వారు ఇళ్లలో విలువైన ఆభరణాలు, నగదు ఉంచి వెళ్లవద్దని సూచించారు. బ్యాంక్ లాకర్లలో లేదా మీ నమ్మకస్తులు, లేదా బంధువుల వద్ద ఉంచుకోవాలన్నారు. ఊళ్లకు వెళ్లే సమయంలో బ్యాగుల్లో బంగారం, నగదు తీసుకెళ్తుంటే జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీంతో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. హిందూపురం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పరిగి బస్టాండ్, ప్రధాన కూడళ్ల వద్ద సిబ్బందిని మఫ్టీలో ఉంచామన్నారు. అత్యవసరమైతే 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. హిందూపురం పట్టణంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతుంటే 9440796844 నంబర్‌కు లేదా ఎస్‌ఐ హరూన్‌బాషా 9392918292 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

సందడిగా వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీ

పెనుకొండ: పట్టణంలోని మూమెంట్ ఇండియన్ వారి సౌజన్యంతో సమత, జ్యోతి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శనివారం వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీ సందడిగా సాగింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి మాట్లాడారు. బానిసత్వ నిర్మూలన, వెట్టి చాకిరి నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. లైంగిక దోపిడీని అరికట్టడం, గృహ హింస, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

‘క్రిమి సంహారక’ నీరు తాగి మేకల మృతి

పావగడ: తాలూకాలోని గొడ తిమ్మనహళ్లి గ్రామంలో శనివారం క్రిమి సంహారక మందు కలసిన నీరు తాగడంతో 8 మేకలు మృతి చెందాయి. వివరాలు.. టమాట పంటకు పిచికారీ చేసేందుకు సిద్ధం చేసిన క్రిమి సంహారక మందు కలిపిన నీటిని మేకలు తాగాయి. అనంతరం కొంత సమయానికి ఒక్కొక్క మేక కడుపు ఉబ్బి మృతి చెందాయి. రైతు నాగప్పకు చెందిన 3 మేకలు, కుంటి రామాంజి, చెన్నరాయకు చెందిన రెండు మేకలు, నాగప్పకు చెందిన 3 మేకలు మృతి చెందాయి. పశు వైద్యాధికారి తదితర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం చేశారు.



మృతి చెందిన మేకలు

పురంలో జోరుగా క్రికెట్ బెట్టింగ్



హిందూపురం: నగరాలకే పరిమితమైన బెట్టింగ్ ఇప్పుడు పట్టణాలు, పల్లెలకు సైతం పాకిపోయింది. బెట్టింగ్‌లతో గంటల్లో రూ.లక్షలు చేతులు మారిపోతున్నాయి. ఈ పందేల్లో కొందరు ఉన్నదంతా పోగొట్టుకుని అప్పులపాలవుతున్నారు. గతంలో జరిగిన మ్యాచ్‌లపై భారీగా బెట్టింగ్ కాచి అప్పులు చెల్లించలేక పలువురు ఊళ్లు వదిలిపోయిన సంఘటనలు ఉన్నాయి. పురుషుల క్రికెట్ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరుగుతుండటంతో యువత, బెట్టింగ్‌రాయుళ్లు టీవీలకు అతుక్కుపోతున్నారు. హిందూపురం పట్టణంలోని మేళాపురం, ముద్దిరెడ్డిపల్లి, ముక్కిడిపేట, ఆర్టీసీ కాలనీ, ఆర్‌పీజీటీ రోడ్డు, మెయిన్‌బజారు, రహమత్‌పురం, బోయపేట, సుగూరు, శ్రీకంఠపురంతో పాటు తూమకుంట, కిరికెర, తదితర గ్రామాలతో పాటు చిలమత్తూరు, కొడికొండ చెక్‌పోస్టు, లేపాక్షి ప్రాంతాల్లో కూడా బెట్టింగ్ సాగుతోందని తెలిసింది.

కర్ణాటక నుంచి ఆపరేటింగ్..

హిందూపురం పట్టణ పరిసరాల్లో బుకీలు మాకం వేసి రహస్య ప్రాంతాల్లో ఉంటూ ఫోన్ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. మరి కొందరు బుకీలు కర్ణాటకలోని బాగేపల్లి, గౌరిబిదనూర్, బెంగళూరులో ఉంటూ రూ.లక్షల్లో బెట్టింగ్ సాగిస్తున్నారని సమాచారం. శనివారం ఇండియా, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌పై భారీగా బెట్టింగ్ జరిగింది. చాలామంది ఇండియాపై బెట్టింగ్ వేసినట్లు తెలిసింది. మ్యాచ్ ప్రారంభమైనప్పటి నుంచి టాస్, వికెట్, స్కోర్, సెంచరీ, ఆఫ్ సెంచరీ చేస్తారా చేయరా? వికెట్ పడుతుందా లేదా ఇలా ప్రతి బంతికీ బెట్టింగ్ సాగింది.

ప్రత్యేక నిఘా..

వరల్డ్‌కప్ మ్యాచ్‌లు ప్రారంభం అయినప్పటి నుంచి ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. యువత బెట్టింట్ జోలికి వెళ్తే ఉపేక్షింది లేదన్నారు.

బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

హిందూపురం అర్బన్: పట్టణంలోని టిప్పు సుల్తాన్ స్ట్రీట్‌లో క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై పోలీసులు దాడి చేశారు. విద్యానగర్‌కు చెందిన ఎస్.వినయ్‌కుమార్, ముద్దిరెడ్డిపల్లికి చెందిన పురుషోత్తం టిప్పూఖాన్ స్ట్రీట్‌కు చెందిన ఆర్.వినయ్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.62,000 నగదు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ హరూన్‌బాషా తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితుడు

హిందూపురం అర్బన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో గురువారం రాత్రి 10 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కట్టా చైత్ర (40), శ్రీ ఆద్య (8) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతూ శ్రీ ఆద్య (8) మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు, ముక్కిడి పేటకు చెందిన ఇస్లాఫ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ హరూన్ బాషా తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

గోరంట్ల: మండల పరిధిలోని గంగాదేవపల్లికి చెందిన రైతు రామలింగారెడ్డి ఈనెల 5వ తేదీన తన మొక్కజొన్న తోటలో పాముకాటుకు గురైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం గోరంట్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. ప్రథమ చిత్స అనంతరం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే రామలింగారెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు సూర్యనారాయణ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేట వెంకటరమణ స్వామికి పూజలు

హిందూపురం: పట్టణంలోని మెయిన్ బజారులో ఉన్న పేట వెంకట రమణస్వామి ఆలయంలో శనివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్ శ్రీదేవి, భూదేవి సమేత వెంకట రమణ స్వామికి పంచామృతాభిషేకాలు చేశారు. బంగారు కవచధారణ, పుష్పాంకరణ చేసి అర్చనలు, పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి మేళతాళాలతో ప్రాకారోత్సవం చేశారు. సాయంత్రం మహా మంగళ హారతులిచ్చి భక్తులకు ప్రసాదం అందజేశారు.